నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శుక్రవారం 2 మే 2025 | NIZAMABAD




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# ఏ పథకం అమలవుతున్నదో చెప్పాలి?

- సీఎం కావడానికి రేవంత్ ఆడని అబద్ధంలేదు.. చేయని మోసం లేదు..
- వరంగల్ సభ చూసి లాగు తడుపుకుంటున్నడు
- ఆయనకు కుటుంబ సౌఖ్యం తప్ప తెలంగాణ ముఖ్యం కాదు..
- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడమంటే మళ్లీ తెలంగాణను ఆంధ్రలో కలపడమే
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


ఖలీల్‌వాడి, మే 1 : కాంగ్రెస్ పాలనలో అసలు ఏ పథకం అమలువుతున్నదో చెప్పాలని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి..సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, 24 గంటల కరెంట్, చేప పిల్లలు, గొర్రెల పంపిణీ, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా,క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లు, దళిత బంధు, దూప దీప నైవేద్యం, వేద పండితులకు గౌరవ భృతి తదితర పథకాలను అమలుచేస్తున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను చర్చకు రమ్మనే స్థాయి రేవంత్‌కు లేదని స్పష్టం చేశారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అవుట్ సోర్సింగ్ సీఎం అని పేర్కొన్నారు. ఆయనది ఒరిజినల్ కాంగ్రెస్ బ్రాండ్ కాదని, అసలు అడ్రస్ ఆర్ఎస్ఎస్ అని, కరెప్ట్ కోసం కాంగ్రెస్‌కు షిఫ్ట్ అయ్యాడని విమర్శించారు. చంద్రబాబుకు రేవంత్ ముద్దుల చిట్టినాయుడు అని, బడేబాయ్ మోదీకి ఇష్టమైన చోటేబాయ్ అని అన్నారు. సీఎం కావడానికి రేవంత్ ఆడని అబద్ధం లేదని, చేయని మోసం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ, చంద్రబాబుకు మొక్కి, ఒర్జినల్ కాంగ్రెస్ నేతలను తొక్కి సీఎం సీట్లో కూర్చున్నాడని అన్నారు. చీమలు పెట్టిన పుట్టలోకి దూరిన పాము అని పేర్కొన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జెంటిల్ మ్యాన్ అని, రేవంత్ మెంటల్ మ్యాన్ అన్నారు.

### ఆంధ్ర భజనలో ఆరితేరిన పీసీసీ చీఫ్

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆంధ్ర భజన చేయడంలో ఆరితేరిండని ఎద్దేవా చేశారు.తెలంగాణ రైతులకు ఆంధ్రోళ్లు వ్యవసాయం చేయడం నేర్పారని పీసీసీ చీఫ్ అవమానించారని మండిపడ్డారు. ఇంకా నయం మన గౌడన్నలకు కూడా కల్లు గీయడం ఆంధ్రోళ్లే నేర్పించారనలేదన్నారు. రేవంత్‌రెడ్డిది టీడీపీ భజన, చంద్రబాబు జపమన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం ఇచ్చింది టీడీపీ అంటాడని, తెల్లన్నం తింటుంటే ఎన్టీఆర్, హైటెక్ సిటీ చూస్తే చంద్రబాబు గుర్తుకొస్తున్నాడంటున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎప్పటికైనా అన్నం పెట్టిన కాంగ్రెస్ చేతికి సున్నం పెట్టడం ఖాయమన్నారు. రేవంత్ ఎప్పటికైనా తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదమని హెచ్చరించారు. ఇకనైనా ఆంధ్ర భజన మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని జీవన్‌రెడ్డి హితవు పలికారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్, పార్టీ నాయకులు రాంకిషన్‌రావు, సత్యప్రకాశ్, సుజిత్‌సింగ్ ఠాకూర్, పూజా నరేందర్, పోల సుధాకర్, సుంకరి రవి, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్, రాజన్న, మోహన్, రజనీష్, రవి, నవీన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### రజతోత్సవ సభతో రేవంత్ మైండ్ బ్లాక్

బీఆర్ఎస్ సభ చూసి రేవంత్ మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. సభకొచ్చిన జనాన్ని చూసి లాగు తడుపుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తెలంగాణ విలన్ అన్నందుకే కేసీఆర్ మీద పడి ఏడుస్తున్న రేవంత్.. మరి సోనియాగాంధీని బలిదేవత అన్నప్పుడు సిగ్గు లేదా ? అని ప్రశ్నించారు. రేవంత్‌కు ఆయన కుటుంబ సౌఖ్యం తప్ప తెలంగాణ ముఖ్యం కాదన్నారు. సభలో కేసీఆర్ తన పేరు ఉచ్చరించలేదని అక్కసు పెంచుకున్నాడని అన్నారు. ప్రజలే రేవంత్ పేరు ఉచ్చరించడంలేదని, చివరకు మంత్రులు జూపల్లి, పొన్నం, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్ కూడా పలు సందర్భాల్లో రేవంత్‌రెడ్డి పేరు మరిచిపోయారని గుర్తుచేశారు. ఈ మధ్య హైదరాబాద్ వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా రేవంత్ పేరు గుర్తుకు రాలేదన్నారు. ఎక్కడైనా ఆయన పేరెత్తితే జనమే కొట్టేట్టున్నారని పేర్కొన్నారు. పేరు చెప్పని వారిపై కక్ష సాధిస్తున్నాడని ఆరోపించారు. ఇదొక మానసిక రోగమని, రాహుల్ గాంధీ వెంటనే రేవంత్‌ను దవాఖానలో చేర్పించాలని సూచించారు. చరిత్ర గతినే మార్చిన కేసీఆర్‌పై అవాకులు చెవాకులా పేలితే ఊరుకునేది లేదన్నారు. రేవంత్‌కు రాజకీయ సమాధి కట్టడానికి కొడంగల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహించాలని, ఎవరు ఎవరికి సమాధి కడతారో తెలుస్తుందన్నారు. కేసీఆర్ తత్వం అభివృద్ధికి పునాది అని, రేవంత్ తత్వం అభివృద్ధికి సమాధి అని పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడమంటే మళ్లీ తెలంగాణను ఆంధ్రలో కలపడమేనని అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం ఎవరి తరం కాదన్నారు. రేవంత్‌రెడ్డికి పెట్టడానికి చేతులు రావని, కానీ తిట్టడానికి బూత్ లోస్తాయన్నారు.



హస్తం పార్టీలో పదవుల పందేరం

- మంత్రి వర్గ కూర్పుపై తాత్సారం
- ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో నైరాశ్యం
- పార్టీ పెద్దల తీరుపై ఆగ్రహం
- ఎవరికో ఒకరికి ఇవ్వాలంటూ విన్నపం

# విస్తరణపై ఆశలు తప్పని ఎదురుచూపులు


**కొంతకాలంగా** అధికార కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అదుగో మంత్రి వర్గ విస్తరణ..ఇదిగో ప్రమాణస్వీకారం..అంటూ వార్తలు వినిపించడంతో పార్టీలోని కీలక నేతలు, ప్రజాప్రతినిధులు ఆశల పల్లకీలో తేలియాడారు. కానీ అవన్నీ వట్టి మాటలే అని తేలడంతో ఏడాదిన్నరగా మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలు, క్యాబినెట్ బెర్త్ కోసం పోటీపడుతున్న మాజీ ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. మొన్నటి వరకూ పదవులు ఇవ్వాలంటూ సాగిల పడిన నేతలంతా ఇప్పుడేకంగా ఎవరికో ఒకరికి ఇవ్వండంటూ విన్నవిస్తున్నట్లు సమాచారం. రోజురోజుకూ మంత్రి వర్గ విస్తరణ ఆలస్యమవుతుండడం.. పదవులపై ఆశలు పెట్టుకున్నవారిలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రగిలిస్తున్నది.

–నిజామాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**మంత్రి వర్గంలో** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ చోటులేకపోవడంతో ప్రభుత్వపరంగా సంప్రదింపులు, పైరవీలు చేయడానికి పలువురు నేతలకు అడ్డుపుల్లలా మారింది. పక్క జిల్లాలకు చెందిన నేతలతో పైరవీలు చేయించుకుని, సచివాలయంలో అడుగు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణ చీటికి మాటికి వాయిదా పడడం, రోజుకో విధంగా సామాజిక సమీకరణాలు మారుతుండడంతో ఇప్పట్లో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా? ఉండదా? అనే చర్చ పార్టీ వర్గాల్లో మొదలైంది. మరోవైపు ద్వితీయ శ్రేణి నేతలు సైతం పార్టీ అధిష్టానం తీరుపై మండిపడుతున్నట్లు సమాచారం. పదవులు ఇస్తామని చెప్పి, ఏడాదిన్నర దాటినా ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై గుర్రుమంటున్నట్లు తెలిసింది. కనీసం పార్టీ పరమైన పదవుల్లోనైనా చోటు కల్పించాలంటూ పలువురు వేడుకుంటున్నట్లుగా సమాచారం. ప్రభుత్వంతోపాటు పార్టీలోనూ పదవుల పందెరం ఇప్పట్లో ముగిసేలా కనిపించకపోవడంతో హస్తం నేతలంతా నిట్టూరుస్తున్నారు.

### ఆశావహుల్లో నైరాశ్యం

ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు సంకట స్థితి ఏర్పడింది.రేసులో నేనున్నానంటూ ముందుకురాగా.. ఇప్పటికే కొంత మంది ఎమ్మెల్యేల అనుచరులు పాదయాత్రలు చేపట్టారు. ఆందోళనలు చేశారు. విన్నపాలు అందిస్తున్నారు. టీవీ సీరియల్ కన్నా ఎక్కువ ఉత్కంఠ, ఆసక్తి మంత్రివర్గ విస్తరణ విషయంలో చోటుచేసుకున్నది. డెడ్‌లైన్‌లు మారుతున్నప్పటి నుంచి, మంచి రోజులు గడిచి పోతున్నప్పటికీ ముహూర్తం మాత్రం ఖాయం కాకపోడంపై అసంతృప్తికి గురవుతున్నారు. ఒక దశలో పార్టీ అధిష్టానంపైనే సొంత నేతలే విసుక్కుంటున్నారు. బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వీరిలో భూపతి రెడ్డి గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు తొలిసారి శాసనసభలో అడుగు పెట్టారు. ఇక బోధన్ నుంచి సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు ఇద్దరు కూడా తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఏఐసీసీతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగించుకుని వీరు కూడా మంత్రి వర్గ రేసులో ఉండడంతో సీనియర్లు సైతం తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్లుగా ప్రచారం జరుగుతున్నది. తనకు ఇవ్వకున్నా ఫర్వాలేదు కానీ, మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇస్తే ఊరుకునేది లేదన్నట్లు సీనియర్ నేత ఒకరు ఏఐసీసీ పెద్దలకు కబురు పంపినట్లు సమాచారం.ఇలా మంత్రివర్గ కూర్పు కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తికి ఆజ్యం పోస్తుండగా మరోవైపు గ్రూపులను పెంచి పోషిస్తున్నది.



### ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

మంత్రి పదవిపై ఆశ పడుతున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన పార్టీలోని సీనియర్ నేతలు పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వారితోపాటు ఓడిన వారు సైతం బరిలో నిలిచి పైరవీలు చేసుకుంటున్నారు. మంత్రి వర్గ విస్తరణ ఉగాది నాటికి పూర్తవుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్పుకుంటూ వచ్చాయి. ఏఐసీసీ అగ్ర నాయకత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏప్రిల్ మొదటి వారంలోనే ప్రమాణ స్వీకారం ఉంటుందని అంతా ఆశించారు. కానీ మంత్రి వర్గ కూర్పు మరోసారి వాయిదా పడడంతో నేతలంతా ఆందోళన చెందుతున్నారు. అసలు పదవులు ఇస్తరా? ఇవ్వరా? అంటూ కీలక నేతలపై గుర్రుమంటున్నట్లు తెలిసింది. సామాజిక సమీకరణల నేపథ్యంలో వాయిదాల పర్వం కొనసాగుతున్నప్పటికీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏ నేతను మంత్రి పదవి వరిస్తుందోనన్న ఆసక్తి నెలకొన్నది. మొదటి నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తనకే మంత్రి పదవి వస్తుందని ఆశిస్తుండగా, అది నెరవేరడం ఇప్పట్లో కష్టమేనని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. మంత్రివర్గ విస్తరణపై జాప్యం నెలకొనడంతో పదవి కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతుండడం గమనార్హం.



# అవినీతి పోలీసుపై వేటు

వినాయక్‌నగర్, మే 1: అవినీతికి పాల్పడిన ఓ పోలీసుపై వేటు పడింది. తోటి సిబ్బందితోపాటు స్నేహితులను మోసం చేసిన కేసులో సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సీపీ సాయి చైతన్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ సౌత్ రూరల్ సర్కిల్ పరిధిలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్ గజానంద్ జాదవ్ జిల్లా కోర్టులో విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ నేరాలకు సంబంధించి ప్రాపర్టీ రిలీజ్ కేసుల్లో పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. వివిధ కేసుల్లో అవినీతికి పాల్పడగా ఆరో టౌన్‌లో కేసులు నమోదైనట్లు తెలిసింది. చిట్టీలు వేసి తన తోటి సిబ్బంది, స్నేహితులను గ్యారెంటీలుగా పెట్టి డబ్బులు తీసుకునేవాడు. తీసుకున్న చిటీ డబ్బులు కట్టకపోగా తనకు గ్యారంటీలుగా ఉన్న తోటి సిబ్బంది, స్నేహితుల నుంచి రికవరీ చేసి వారిని మోసం చేశాడు. దీంతో పలువురు బాధితులు నాల్గో టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సదరు కానిస్టేబుల్ అవినీతి, అక్రమాల వ్యవహారం సీపీ దృష్టికి రావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశారు.

# కక్షిదారు చెంతకే న్యాయమూర్తి

వినాయక్‌నగర్, మే 1: నిజామాబాద్ రెండో అదనపు జ్యుడీషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీనివాస్ రావు ఔదార్యం చాటుకున్నారు. జిల్లా కోర్టులో గురువారం ఓ కేసు విచారణ కోసం ఓ వృద్ధురాలు వచ్చింది. కానీ కోర్టు హాలు వరకు నడవలేని స్థితి. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ రెండో అదనపు జ్యుడీషియల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీనివాస్ రావు స్వయంగా కక్షిదారు (వృద్ధురాలు) వద్దకు వచ్చి కేసు పూర్వపరాలు సేకరించి, నేర అభియోగాలు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ ప్రాంతానికి చెందిన బండి సురేశ్‌పై అతడి భార్య మానసిక, శారీరక వేధింపులు, అదనపు కట్నం కింద కేసు పెట్టింది. ఈ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న అనసూయ అనే వృద్ధురాలు కోర్టుకు వచ్చింది. నడవలేని స్థితిలో ఉండడంతో కోర్టు మెట్లు ఎక్కడం కష్టంగా మారింది. ఆమె ఆరోగ్య పరిస్థితిని న్యాయవాది.. న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు కోర్టు మొదటి అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగివచ్చి, ఆమె వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

# కార్మికశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

వినాయక్‌నగర్, మే 1: ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరతలక్ష్మి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో మేడే సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు కార్మికుల దరి చేరాలని సూచించారు. అదనపు జడ్జిలు ఆశాలత, హరీశ మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నదని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయభాస్కర్‌రావు, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజు, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, సంస్థ పర్యవేక్షకురాలు శైలజారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.




పొతంగల్ మండల కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

# ఖాళీ బిందెలతో నిరసన

పొతంగల్, మే 1: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పొతంగల్ మండల కేంద్రంలోని పలు కాలనీల ప్రజలు ఎంపీడీవో కార్యాల యం ఎదుట గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీ, వడ్డెర కాలనీ, బాజిరెడ్డి కాలనీల్లో కొన్ని నెలలుగా నల్లా నీళ్లు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎండలు మండుతుండడంతో తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నట్లు వాపోయారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్‌కు వినతిపత్రం అందజేశారు.

# ఆగని ఇసుక దందా !

- మంజీర నుంచి అక్రమ రవాణా
- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- ఉదయం తవ్వకాలు.. రాత్రివేళ తరలింపు
- ఒకే వే బిల్లుపై అనుమతికి మించి ఇసుక తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



బిచ్కుంద మండలం కందర్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు



ప్రభుత్వ పనులకు అనుమతి పొంది బిచ్కుందలో ప్రైవేటు పనుల వద్ద డంపు చేస్తున్న ఇసుక(ఫైల్)

బిచ్కుంద, మే 1: జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. ఇసుకాసురులకు అడ్డూఅదుపులేకుండా పోతున్నది. కామారెడ్డి జిల్లా బిచ్కుందలో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. మండలంలోని హస్గుల్, పుల్కల్, ఖత్గాం గ్రామాల శివారులోని మంజీర పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల పేరిట అనుమతులు తీసుకుంటూ ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు. ప్రైవేట్‌గా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్ద కొడప్‌గల్, పిట్లం, డోంగ్లి, నిజాంసాగర్ మండలాల్లో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల కోసం వారంలో మూడు రోజులు పుల్కల్ మంజీర నుంచి ఇసుకను తరలించడానికి తహసీల్ ఆఫీస్ నుంచి అనుమతులు తెచ్చుకుంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇసుక తవ్వకాలు చేపట్ట వచ్చు. వేబిల్లును ఒక ట్రిప్పుకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఒకే వేబిల్లుపై అనేక ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు.

పుల్కల్, హస్గుల్ మంజీర నుంచి ఉదయం డంపు చేసి, రాత్రివేళ టిప్పర్ల ద్వారా హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. గత శనివారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమతులు లేకుండా తరలిస్తున్న పది ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### పట్టించుకోని అధికారులు

ఫిర్యాదులు అందిన సందర్భాల్లో తప్ప, మిగితా సమయాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల్లో గండి పడుతున్నది. దీనిపై రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖల నిఘా కరువైంది. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను మండలవాసులు కోరుతున్నారు.

### ఇసుకాసురులపై కఠిన చర్యలు

ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. జుక్కల్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల కోసం మండలంలోని పుల్కల్ మంజీర నుంచి మంగళ, గురు, శనివారాల్లో అనుమతులు ఇస్తున్నాం. ప్రైవేటుగా ఎవరికైనా ఇసుక అవసరం ఉంటే డీడీ తీసి అనుమతులు పొందవచ్చు. ప్రజల్లో అవగాహన కల్పించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే మాకు సమాచారం ఇవ్వాలి.

-వేణుగోపాల్, తహసీల్దార్